# నూన్‌లైట్ రక్ష



పగలు, రాత్రి.. పల్లె, పట్నం.. అనే తేడా లేకుండా మహిళలపై అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయి. బయటికి వెళ్లినవాళ్లు ఇంటికి వచ్చే వరకు గండంగానే ఉంది. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా, కఠినమైన చట్టాలు అమలుచేస్తున్నా నేరాలు అదుపులోకి రావడం లేదు. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. సాంకేతికత సాయంతో ఈ నేరాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు, టెక్ కంపెనీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే పలు సేఫ్టీ యాప్‌లను రూపొందిస్తున్నాయి. అటువంటిదే ఈ 'నూన్‌లైట్' యాప్. కొత్త వారిని కలవడానికి వెళ్లినప్పుడైనా, ఒంటరిగా ప్రయాణం సాగిస్తున్నప్పుడైనా మహిళలు తాము ప్రమాదంలో ఉన్నామని భావిస్తే ఈ నూన్‌లైట్ యాప్‌తో చిటికెలో పోలీసులకు సమాచారం అందుతుంది. మీ మొబైల్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. మీ ప్రయాణంలో ప్రమాదం పొంచి ఉందన్న అనుమానం రాగానే యాప్‌లోని 'అన్‌సేఫ్' బటన్‌ను నొక్కి పట్టుకోవాలి. ఒకసారి మీరు సేఫ్‌గా ఉన్నారు అనిపిస్తే బటన్‌ను వదిలేసిన వెంటనే నాలుగు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాలి. అదే, మీరు ప్రమాదంలోనే ఉన్నట్టయితే బటన్‌ను రిలీజ్ చేసిన అనంతరం పిన్ నంబర్ ఎంటర్ చేయకూడదు. దాంతో వెంటనే ఎమర్జెన్సీ సహాయాన్ని పొందే విధంగా మీ లొకేషన్, సమాచారం పోలీసులకు చేరిపోతుంది. తక్షణ రక్షణ చర్యలు మొదలవుతాయి.




నమస్తే తెలంగాణ
జిందగీ 13
హైదరాబాద్ | బుధవారం 26 జూన్ 2024 www.ntnews.com

# సానియా నయా పోస్ట్



టెన్నిస్ స్టార్ సానియా మీర్జా గురించి తెలియని వాళ్లు ఉండరు. ఆటతోనే కాదు.. పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను పెండ్లి చేసుకుని విడాకులు తీసుకునే వరకు ఆమె ఏం చేసినా సంచలనమే. సోషల్ మీడియాలో కూడా ఆమె ఏ పోస్ట్ పెట్టినా వైరల్‌గా మారుతుంది. ఇటీవల హజ్ యాత్రకు వెళుతూ సానియా చేసిన పోస్ట్ సంచలనంగా మారింది. హజ్ యాత్రతో తన జీవితంలో మార్పు వస్తుందని, బలమైన వ్యక్తిగా తిరిగి వస్తానని ఆ పోస్టులో సానియా పేర్కొన్నది. ఇంకేం.. రెండో పెండ్లికి సానియా సిద్ధమవుతున్నదని.. నెట్టింట చర్చలు మొదలయ్యాయి. సానియా, భారత క్రికెట్ జట్టు బౌలర్ షమీ పెండ్లి చేసుకోనున్నారన్న వార్తలు తరచూ వైరల్ అవుతూ ఉంటాయి. ఈ పుకార్లను సానియా తండ్రి ఇమ్రాన్ మీర్జాతోపాటు షమీ కూడా కొట్టిపారేశారు. తన జీవితంలో విన్న అతిపెద్ద రూమర్ ఇదేనని షమీ క్లారిటీ కూడా ఇచ్చారు. అయినా.. సామాజిక మాధ్యమాలు వారిని ఇంకా టార్గెట్ చేస్తూనే ఉన్నాయి. తాజాగా సానియా పోస్టుపై రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు నెటిజన్లు. తన పోస్టుపై సానియా మరింత క్లారిటీ ఇస్తే తప్ప ఈ రూమర్లు ఆగేలా లేవు.






# ఈ రేవు మహా చెడ్డది

రేవ్ పార్టీలో ఏముంటుంది.. మహా అయితే తాగుతారు. సరదాగా డ్యాన్స్ చేస్తారు. అంతేగా అనుకుంటారు చాలామంది! అరిషడ్వర్గాలను అధీనంలో ఉంచుకున్న కలి కూడా ఈ పార్టీని చూస్తే.. ఆశ్చర్యపోతాడు. అంత పచ్చిగా ఉంటుంది పార్టీలో వాతావరణం. ఇక్కడ జరిగే తంతు సామాన్యుల ఊహకు అందదు. సూర్యాస్తమయంతో మొదలయ్యే విశృంఖల విన్యాసం మర్నాడు సూర్యోదయం వరకు విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉంటుంది. ఇలాంటి పార్టీలకు వ్యక్తుల ఎంపిక నుంచి వారు స్వస్థలానికి క్షేమంగా వెళ్లే వరకూ అంతా గోప్యంగా సాగుతుంది. అలాగని ఎవరు పడితే వారు ఈ జోన్‌లోకి అడుగుపెట్టలేరు. పార్టీకి ఎవరు రావాలనేది నిర్వాహకులు డిసైడ్ చేస్తారు. సెలెబ్రిటీలు, సంపన్నులు, వ్యాపారవేత్తల వారసులు ఇలా డబ్బున్న వారినే డ్రగ్ పెడ్లర్స్ ఆహ్వానిస్తారు.



పార్టీ స్థాయి, అందులో లభ్యమయ్యే సరుకును బట్టి ఎంట్రీ ఫీజు ధర రూ.25 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఎంపిక చేసిన వ్యక్తులనే పార్టీకి పిలుస్తారు. ఇక్కడ ఆడా, మగా భేషజాలు ఉండవు. అందరూ కస్టమర్లే! సదరు వ్యక్తికి ఎలాంటి దురభ్యాసాలూ లేకపోతే.. సిగరెట్‌తో మత్తుప్రాశన చేస్తారు. గంజాతో డోసు పెంచుతారు. డ్రగ్స్ ఇచ్చి వశపరుచుకుంటారు. మగువను ఎగదోసి పూర్తిగా లోబరుచుకుంటారు. అలా డ్రగ్ పెడ్లర్స్ ఉచ్చులో చిక్కుకున్న వాళ్లను సిగ్నల్ యాప్ ద్వారా రేవ్ పార్టీలకు ఆహ్వానిస్తారు. పార్టీ జరిగే చోట సిగ్నల్స్ ఉండవు. ఫోన్లు ఉన్నా పనిచేయవు. కెమెరాలు అస్సలు ఉండవు. పార్టీకి పికప్ పాయింట్ నుంచి డ్రాపింగ్ వరకు నో మొబైల్స్, నో కెమెరా, నో అప్‌డేట్స్.. అంతా ష్.. గప్‌చుప్. మత్తంతా దిగిన తర్వాత కస్టమర్ కోరిన చోట పదిలంగా దింపుతారు.

### పార్టీలో పరాకాష్ఠ

రేవ్‌పార్టీల్లో డ్రగ్స్ తర్వాత సెక్స్‌దే ఆధిపత్యం. ఇక్కడికి వచ్చే కస్టమర్లకు హెచ్ఐవీ టెస్టులు కూడా చేస్తుంటారు. ఒక్కసారి అన్‌లిమిటెడ్ పార్టీలకు వెళ్లిన తర్వాత ఎవరు.. ఎవరితో సెక్స్‌లో పాల్గొంటారో వారికే తెలియదు. పశుత్వం కట్టలు తెంచుకుంటుంది. పార్ట్‌నర్స్‌ను మార్చుకుంటూ.. దిగజారుతుంటారు. ఈ తరహా రేవ్ పార్టీలకు హాజరయ్యేవారిలో ఆడవాళ్ల శాతమూ ఎక్కువే! వీరిలో కొందరు డబ్బుల కోసం వస్తే.. మరి కొందరు డ్రగ్స్ కోసం ఉచ్చులో చిక్కుతారు. కొందరు పార్టీకి ముందే సెక్స్ పార్ట్‌నర్‌ను ఎంచుకుంటే.. మరి కొందరు పార్టీకి వచ్చిన తర్వాత నచ్చిన వారిని ఎంపిక చేసుకుంటారు. ఒక్కసారి పార్టీ మొదలయ్యాక మనుషులు మృగాలుగా మారిపోతారు. అక్కడ తాగుబోతులే బెటర్ అనిపిస్తుంది. డ్రగ్స్ కావాలనుకునేవాళ్లు ఒక చోట చేరుతారు. శృంగారం కావాలనుకువాళ్లు మరో జోన్‌లోకి ప్రవేశిస్తారు. విచ్చలవిడి సెక్స్ కావాలని తపించేవారు ఇంకో గూటికి చేరుకుంటారు. అక్కడ గంటల తరబడి మృగత్వం రాజ్యమేలుతుంది. ఒక్కోసారి రోజుల తరబడి కొనసాగుతుంది.

### అందగత్తెలకు ఫ్రీ ఎంట్రీ

పార్టీకి వచ్చినవారిని సంతృప్తిపరచడానికి నాణ్యమైన డ్రగ్స్ సరఫరా చేస్తుంటారు పెడ్లర్స్. అంతేకాదు, వారిని పూర్తిగా గ్రిప్‌లో ఉంచుకునేలా అందమైన అతివలను వలగా విసురుతారు. ఇలాంటివారికి ఎంట్రీ ఫ్రీ! వయసులో ఉన్న ఆడపిల్లలకు డ్రగ్స్ అలవాటు చేసి, వాటి ఆశచూపి అంగడి సరుకుగా మార్చేస్తుంటారు. డ్రగ్స్ కోసం ఉద్యోగాలు వదిలేసే టెకీలు కొందరైతే.. అవి దొరక్క ఆత్మహత్యకు పాల్పడినవాళ్లూ ఉన్నారు. మొదట డబ్బు కోసం డ్రగ్స్ పార్టీలకు వెళ్లిన యువతులు.. ఆ మత్తులో ఉన్నదంతా పోగొట్టుకొని, సెక్స్ వర్కర్లుగా మారుతున్నారని ఓ బాధితురాలి ఆవేదన.

### బాధితులు కాదు...

రేవ్‌పార్టీల్లో దొరికిన వారిని బాధితులుగానే పోలీసులు చూస్తున్నారు. రెండ్రోజులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. నిర్వాహకులను, డ్రగ్ సప్లయర్స్‌ను అరెస్టు చేస్తున్నారు. పోలీసుల కౌన్సెలింగ్ తీసుకున్న వాళ్లు.. నాలుగు రోజులు కాగానే షరామామూలుగా తర్వాత పార్టీ ఎక్కడుందో సెర్చ్ చేస్తున్నారు. ఇలాంటి పార్టీల్లో పాల్గొన్నవారిని కూడా శిక్షించేలా చట్టాలు చేస్తేగానీ మార్పు రాదని బాధితులే చెబుతున్నారు. ఆ నరకం నుంచి బయటపడటానికి తనకు రెండేండ్ల సమయం పట్టిందని ఓ బాధితురాలు చెప్పుకొచ్చింది. వారం వారం సాగే ఈ పాడు పార్టీలపై ఏడాదికి ఒకటి రెండుసార్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తే ఏం ప్రయోజనం అని ఆమె ప్రశ్నిస్తున్నది. పార్టీ కల్చర్ ముసుగులో వికృత ఆనందం పొందుతూ, సమాజాన్ని పీడిస్తున్న వాళ్లు ఉగ్రవాదుల కన్నా ప్రమాదకరం. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే భవిష్యత్తులో ప్రతి వీధిలో ఓ రేవ్‌పార్టీ అడ్డా పుట్టుకొస్తుంది. మాదకద్రవ్యాలకు ఓ తరమంతా నిర్వీర్యమవుతుంది. తల్లిదండ్రులూ బీ కేర్‌ఫుల్. టీనేజ్ పిల్లలను పట్టుదలగా నియంత్రిస్తే బాగోదు అనుకుంటే... ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితులు ఎదురవ్వొచ్చు. పిల్లలకు స్వేచ్ఛనిచ్చినా, వారిపై ఓ కన్నేసి ఉంచడం మీ బాధ్యత అని మర్చిపోకండి.

... రవికుమార్ తోటపల్లి



> "రేవ్ పార్టీల ప్రధాన ఉద్దేశం డ్రగ్స్‌ను అలవాటు చేయడం, అమ్మడం. ఆ పార్టీకి వచ్చిన వారంతా కచ్చితంగా పెడ్లర్ దగ్గర డ్రగ్స్ తీసుకోవాల్సిందే. అలా నెట్‌వర్క్ పెంచుకుంటూ.. వెళ్లడమే డ్రగ్ పెడ్లర్స్ లక్ష్యం. బాధితుల జీవితం ఏమవుతుందనే బాధ వారికి ఉండదు. డబ్బున్నవారిని మానసికంగా తమ వైపు తెచ్చుకొని డ్రగ్స్‌కు, ఫ్రీ సెక్స్‌కు అలవాటు చేసి బిజినెస్‌ను పెంచుకోవడమే రేవ్ పార్టీ నిర్వాహకుల ప్రధాన లక్ష్యం."

**విలువలు ఉండవు. వలువలు ఉండీ ఉండవు. షరతులు అస్సలే ఉండవు. చిత్తుగా తాగుతూ.. మత్తుగా ఊగుతూ.. డ్రగ్స్‌లో జోగుతూ.. ఇదీ రేవ్ పార్టీ కల్చర్. డబ్బు పట్టిన మనుషుల ఆగడాలకు ఇది అడ్డా! బహిరంగ సరసాలకు నర్తనశాల. కండ్లు మూసుకుపోయిన బలవంతులు.. తమ వాంఛలు తీర్చుకోవడానికి ఎంచుకున్న అంధకూపం ఈ రేవ్‌పార్టీ. సంబురాల ముసుగులో డ్రగ్స్ రాకెట్లు దూసుకుపోతుంటాయి. సెక్స్ బ్రాకెట్లు నిస్సిగ్గుగా సకిలిస్తుంటాయి. మనదైన సంప్రదాయాలపై, మానవ సంబంధాలపై దాడి చేస్తున్న పెనుభూతమిది. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా.. రేవ్‌పార్టీ విశృంఖల విధ్వంసంపై కథనం..**

# పిల్లల దగ్గర.. మాట జాగ్రత్త..!

'పిల్లలు అల్లరి చేస్తేనే అందం.. ఈ వయసులో కాకపోతే అల్లరి ఎప్పుడు చేస్తారు. చిన్నప్పుడు అల్లరి చేస్తే పెద్దయ్యాక వాళ్లంతట వాళ్లే సైలెంట్ అయిపోతారు..' అల్లరి పిడుగులు ఉన్న ఇంట ఇవీ పెద్దల మాటలు. అల్లరి హద్దుల్లో ఉంటేనే ముద్దు. కానీ, కొందరు చిన్నారులు ఇల్లు పీకి పందిరేసినంత పనిచేస్తారు. ఇలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరిస్తుంటారు. కట్టలు తెంచుకున్న కోపంలో పిల్లలను గట్టిగా తిడితే ఆ చిట్టి గుండెలు తీవ్రంగా బాధపడతాయని గుర్తుంచుకోవాలి.

### సున్నితంగా..

బయటికి వెళ్లినప్పుడు కంటికి ఆకర్షణీయంగా కనిపించినవి, నచ్చినవీ కొనాలని పిల్లలు మారాం చేస్తూ ఉంటారు. అయితే, పలు కారణాలతో తల్లిదండ్రులు వాటిని కొనడానికి మొగ్గుచూపరు. ధర ఎక్కువ, మన దగ్గర అంత డబ్బు లేదు అనే మాటలు చెబుతారు. ఆ మాటల వల్ల పిల్లల్లో ఫైనాన్షియల్ ఇన్‌సెక్యూరిటీ పెరిగిపోతుంది. అలా కాకుండా పిల్లలకు.. తర్వాత కొనుక్కుందాం.. ఇప్పుడు కాదు.. అనవసరమైన ఖర్చులు చేయకూడదు.. పొదుపు అనేది చాలా ముఖ్యం.. ఇలా నిదానంగా సర్ది చెప్పాలి.



### ఉత్సాహాన్ని చంపొద్దు

పిల్లలు అందరూ ఒకేలా ఉండరు. ఎవరి టాలెంట్ వాళ్లకు ఉంటుంది. తల్లిదండ్రులు అనుకున్న విషయాల్లో పిల్లలు విజయాన్ని సాధించలేకపోవచ్చు. అలాంటి సమయాల్లో.. వారిని అనునయించాలే కానీ, సూటిపోటి మాటలతో బాధపెట్టొద్దు. 'నీ వల్ల కాదు..' అనేలా వ్యవహరిస్తే, వారు ఎందుకూ కొరగాకుండా పోతారు. ప్రోత్సహించకపోయినా ఫర్వాలేదు కానీ, వారి ఉత్సాహంపై మాత్రం నీళ్లు చల్లొద్దు.

### అనవసరంగా అనొద్దు

ఈ తరం పిల్లలు చాలా తెలివి మీరుతున్నారు. వారిముందు అనవసరమైన మాటలు అస్సలు అనొద్దు. 'అనవసరంగా పుట్టావు. నువ్వు పుట్టకున్నా బాగుండేది..' ఇలా ఆవేశంలో మాటజారితే.. పిల్లల మనసు విరిగిపోతుంది. తర్వాత ఎన్ని క్షమాపణలు చెప్పినా.. మీరన్న మాట వారి మనసు నుంచి చెరిగిపోదు. ఎంత విసుగులో ఉన్నా.. దానికి కారణాన్ని పిల్లల మీద రుద్దవద్దు.

### పోలికలు సరికాదు..

ఎదురింటి పిల్లలతోనో, బంధువుల బిడ్డలతోనో తమను పోల్చడం పిల్లలకు అస్సలు నచ్చదు. ఇంట్లోవాళ్లతోనూ కంపేర్ చేయొద్దు. 'అక్క చూడు ఎంత తెలివైందో.. తమ్ముణ్ని చూసి నేర్చుకో..' ఇలాంటి మాటలు వాళ్లకు ఈటల్లా గుచ్చుకుంటాయి. వారిని చూసి కొత్త విషయాలు నేర్చుకోకపోగా, మీ కారణంగా స్నేహితులు, తోబుట్టువులపై కక్ష పెంచుకునే ప్రమాదమూ ఉంది.

# చియా గింజల మాయ

ప్రస్తుతం చాలామందిని బాధిస్తున్న సమస్య కొలెస్ట్రాల్. లావుగా ఉన్నా.. సన్నగా కనిపించినా.. శరీరంలో కొవ్వుల స్థాయులు ఎక్కువగానే ఉంటున్నాయి. దానికి మనం తీసుకునే ఆహారం ఒక కారణం అయితే, లైఫ్‌స్టైల్ మరో కారణం. శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయే కొద్దీ గుండె ప్రమాదానికి చేరువ అవుతున్నట్టే. శరీరంలో పేరుకుపోయిన అధిక కొలెస్ట్రాల్‌ను దూరం చేసుకోవాలంటే మీ డైట్‌లో చిన్న మార్పు చేసుకుంటే సరిపోతుంది. చియా సీడ్స్‌ను ఆహారంలో భాగంగా చేసుకుంటే శరీరంలో పెరిగిపోయిన చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. చియా సీడ్స్‌ను నీటిలో నానబెట్టినప్పుడు వాటి నుంచి జెల్లీ లాంటి పదార్థం వస్తుంది. ఈ జెల్లీ గుండె రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వులను శుభ్రపరుస్తుంది. ఈ గింజల్లో హెల్తీ ఫ్యాట్ ఉంటుంది. అది రక్తంలో హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ట్రైగ్లిజరైడ్ స్థాయులను తగ్గించడంలో సాయపడుతుంది. అంతేకాదు, చియా గింజల్లో ఉండే ఫైబర్.. జీర్ణాశయంలోని చెడుకొవ్వును కరిగిస్తుంది. రక్త ప్రసరణలో ఎదురయ్యే అవరోధాలను నిరోధిస్తుంది.



# చీకట్లను చీల్చుకుని..

పాతికేండ్ల కిందట.. ఓ పసిపాప ఈ లోకంలోకి వచ్చింది. ఆ పుట్టిన పసికందు ఈ లోకం చూడలేని అంధురాలు అని తేలింది. పేగుబంధాన్ని కాదనుకున్నారు తల్లిదండ్రులు. బిడ్డను జల్‌గావ్ రైల్వేస్టేషన్‌లోని ఓ చెత్తకుండీలో పడవేసి చీకట్లో కలిసిపోయారు. బిడ్డను చేరదీసిన పోలీసులు తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. దొరకలేదు. పసికందును జల్‌గావ్‌లోని రిమాండ్‌హోమ్‌కు తరలించారు. అక్కడ దివ్యాంగులకు పునరావాసం కల్పించే వ్యవస్థలేదు. దీంతో ఆ చిన్నారిని దివ్యాంగ్ బీవర్స్ చిల్డ్రన్స్ హోమ్ డైరెక్టర్ శంకర్ బాబా పాపల్కర్‌కు అందజేశారు. అనాథలకు అండగా ఉండే శంకర్‌బాబా పద్మశ్రీ పురస్కార గ్రహీత. అతని చల్లని చేతులు ఆ చిట్టితల్లిని అందుకున్నాయి. మాలా పాపల్కర్ అని నామకరణం చేశాడు. 125 మంది అనాథలు, దివ్యాంగులు ఉండే బాలల గృహంలో మాల జీవనయానం మొదలైంది. శంకర్‌బాబా ప్రోత్సాహంతో చదువు కొనసాగించింది. విదర్భ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ నుంచి బీఏలో ఉత్తీర్ణత సాధించింది. 2019 నుంచి పోటీ పరీక్షలకు సిద్ధమైంది. యూనిక్ అకాడమీ డైరెక్టర్ అమోల్ పాటిల్ ఆధ్వర్యంలో మాల మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) పరీక్షకు సిద్ధమైంది. రెండుసార్లు విఫలమైంది. పట్టుదలగా చదివింది. ఈసారి ఆమె పట్టుదలకు దురదృష్టం తోకముడిచింది. అదృష్టం వెంట నడిచింది. ఎంపీఎస్‌సీ పరీక్షల్లో టైపిస్ట్ ఉద్యోగానికి ఎంపికైంది. గత నెల 16న ఫలితాలు వెలువడ్డాయి. మాల ఎందరో దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచింది. 'ఉద్యోగం సాధించినందుకు సంతోషంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. సివిల్స్‌లో విజయం సాధించడమే నా లక్ష్యం' అని చెప్పుకొచ్చింది మాలా పాపల్కర్.



... పాసికంటి శంకర్, భీవండి